ప్రజాశక్తి
ఆదివారం 14 ఏప్రిల్, 2024



ఇవిఎంల తరలింపు ప్రక్రియ మొదలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జీలానీ సమూన్ అన్నారు. ఇవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తికావడంతో వాటిని శాసనసభ నియోజకవర్గాలకు తరలింపు ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి విధిగా పాటిస్తున్నట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల ప్రక్రియను శాంతియుతం వాతావరణం జరిపించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఇవిఎంల నోడల్ అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రంగోయిలో శుక్రవారం గుడ్డు లేకుండా భోజనం చేస్తున్న విద్యార్థులు



జగన్ మామ...

- వారం రోజులుగా నిలిచిన రాగి జావా
- అరకొరగా గుడ్లు, చెక్కీల పంపిణీ
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

విద్యకు పెద్దపీట వేస్తున్నాం... కోట్లు వ్యయంతో నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలే మార్చేశాం.. ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందిస్తున్నాం.. పాఠ్యపుస్తకాలు, బూట్లు, బ్యాగులు, బెల్టులతో పాటు పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నామని సిఎం జగన్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చివరకు గ్రామస్థాయి వైసిపి నాయకుడు వరకు ప్రచారాలతో ఊదరగొట్టిస్తున్నారు. పై మాటలకు గ్రామస్థాయిలో ఉన్న పాఠశాలల్లో అమలు అవుతున్న పథకాలకు పొంతన లేకుండాపోయింది. వారం రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే వాదన పాఠశాలల్లో జోరుగా వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యార్థులకు గుడ్లు, బెల్లం చెక్కీలు, రాగి జావ పౌష్టికాహారం అందడం లేదని అధికార లెక్కలే అందుకు నిదర్శనం.

పౌష్టికాహారం ఎక్కడ?

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో 2,571 ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత పాఠశాలల్లో సుమారు 1,67,284 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యస్తున్నారు. శుక్రవారం 1,42,281 మంది విద్యార్థులు హాజరైయ్యారు. అందులో మధ్యాహ్నభోజన పథకానికి 1,36,625 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో సుమారు 10,392 మందికి గుడ్లు అందకపోగా, సుమారు 17,081 మంది విద్యార్థులకు బెల్లం చెక్కీలకు దూరమయ్యారు. వారం రోజులుగా పూర్తిస్థాయిలో రాగి జావకు నోచుకోవడంలేదు. ఇలా వేల సంఖ్యలో విద్యార్థులకు పౌష్టికాహారం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని తెలిసినా ఏమి చేయలేని పరిస్థితుల్లో విద్యాశాఖాధికారులు ఉండటంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గుడ్లు, బెల్లం చెక్కీలు, చోడి, బెల్లం పిండి సరఫరా కాకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అమలకు నోచుకోలేదనే వాదనా విద్యార్థులు నుంచి వినిపిస్తోంది.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అరకొరగా గుడ్లు పెడుతున్నారు. గత మూడు వారాలుగా గుడ్లు సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాస్తవానికి గుడ్లు సరఫరా చేసే ఏజెన్సీకు అధిక మొత్తంలో బకాయి ఉండటం వల్ల గుడ్లు సరఫరా నిలిపివేశారని తెలుస్తోంది. కొన్ని పాఠశాలలు నుంచి గుడ్లు లేవని, పాఠశాలలకు సరఫరా నిలిచిపోయిందని మండల స్థాయి విద్యాశాఖాధికారుల దృష్టికి ఉపాధ్యాయులు తీసుకురావడంతో ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు సమాచారం. దీంతో కొన్ని ప్రాంతాలకు గుడ్లు సరఫరా కాగా, చాలా పాఠశాలలకు ఇంకా గుడ్లు సరఫరా కాలేదు. దీంతో పలాస మండలంలో రంగోయి, బొడ్డపాడు, కాంట్రాగడ తదితర ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గుడ్లు పెట్టకుండా విద్యార్థులకు భోజనం పెట్టారు. జిల్లాలోని పలాస మండలంలో 6355 మంది విద్యార్థులకు 5008, వజ్రపుకొత్తూరులో 5,690 మందికి 5,051, లావేరులో 4492 మందికి 3768 ఇలా జిల్లా వ్యాప్తంగా 10, 392 మందికి గుడ్లు పెట్టకుండా విద్యార్థులకు భోజనం పెట్టినట్లు లెక్కలు చెబుతున్నాయి. వాస్తవానికి ప్రతి విద్యార్థికీ తప్పకుండా గుడ్డు పెట్టాల్సి ఉన్న అందుబాటులో గుడ్లు లేకపోవడంతో విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమయ్యారు. మరోవైపు ఎవరికి గుడ్డు పెట్టాలి ఎవరికి ఆపాలో తెలియక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

రాగి జావ దూరం

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బెల్లం చెక్కీలు, గుడ్లు, రాగి జావ మధ్యాహ్న భోజన పథకంలో అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. పాఠశాలలకు గుడ్లు, బెల్లం చెక్కీలు సరఫరా చేయాలని ప్రయివేటు సంస్థలకు అప్పగించగా, రాగి జావ కోసం సత్యసాయి ట్రస్టు నుంచి సరఫరా చేసేవిధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించుకుంది. అయితే వారం రోజులుగా పాఠశాలల్లో చోడి, బెల్లం పిండి పూర్తి కావడంతో రాగి జావకు విద్యార్థులు దూరమయ్యారు. ప్రస్తుతం ఉన్న ఉష్ణోగ్రతలకు విద్యార్థులు మధ్యాహ్న సమయానికి నీరసించి పోతుండటంతో రాగి జావ పంపిణీ చేసి ఉంటే బాగుండేదని విద్యార్థులు అభిప్రాయ పడుతున్నారు. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం బెల్లం చెక్కీలు, రాగి జావ కోసం సరుకులు నిలిపి వేయడంతో విద్యార్థులు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు.

అందని బెల్లం చెక్కీలు

జిల్లాలో వారం రోజులుగా బెల్లం చెక్కీలు, రాగి జావ పిల్లలకు పెట్టడం లేదు. అరకొరగా గుడ్లు పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పలాస మండలంలో 6,357 విద్యార్థులకు 5,284 మంది, వజ్రపుకొత్తూరు మండలంలో 5,690 మంది విద్యార్థులకు 5,290 మంది, గార మండలంలో 5,176 మందికి 4,135, ఇచ్ఛాపురంలో 8,769 మందికి 7800, శ్రీకాకుళంలో 7,800 మందికి 7,100, కవిటి మండలంలో 6,600 మందికి 5,500, కంచిలిలో 5,416 మందికి 4,618, కోటబొమ్మాళిలో 4758 మందికి 3729 మందికి ఇలా మండలాల వారీగా బెల్లం చెక్కీలు పంపిణీ చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. వాస్తవానికి వారం రోజులుగా బెల్లం చెక్కీలు పాఠశాలలకు సరఫరా చేయకపోయినా ముందుగా పంపిణీ చేసిన మిగిలిన చెక్కీలు, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తి కావడంతో వారికి ఇవ్వాల్సిన చెక్కీలను ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అరకొరగా పంపిణీ చేస్తున్నారు.

వాస్తవమే

గత వారం రోజులుగా బెల్లం చెక్కీలు, రాగి జావ విద్యార్థులకు ఇవ్వడం లేదనే మాట వాస్తవమేన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్య ఉండడంతో పాఠశాలలకు సరఫరా చేయలేకపోం. గుడ్లు పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని, ఎక్కడైనా గుడ్లు పెట్టకపోతే పరిశీలించి పూర్తిస్థాయిలో విద్యార్థులకు గుడ్లుతో భోజనం పెట్టే విధంగా చర్యలు చేపడతాం.

- వెంకటేశ్వరరావు, డిఇఒ

గుడ్లు పెట్టడం లేదు

వారానికి ఐదు రోజులు గుడ్లు పెట్టాలి. కానీ ఈ నెల 1 నుంచి గుడ్లు పెట్టడం లేదు. ప్రతి విద్యార్థికీ గుడ్డు లేకుండా రోజూ భోజనం చేస్తున్నాం. గుడ్లు ఎందుకు పెట్టడం లేదో మాకు తెలియదు. గుడ్లు సరఫరా కాలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

- 9వ తరగతి విద్యార్థి, రంగోయి

కొద్ది రోజులుగా రాగి జావ లేదు

ఏప్రిల్ నెల నుంచి రాగి జావ పెట్టడం లేదు. రోజు విడిచి రోజు రాగి జావ పెట్టేవారు. పది రోజులుగా రాగి జావ పెట్టడం లేదు. రాగి జావ కోసం అడుగుతున్నా ఎందుకు పెట్టడం లేదో మాకు అర్థం కావడం లేదు.

- 9వ తరగతి విద్యార్థి, రంగోయి



మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

వైసిపి గెలిస్తే విశాఖే రాజధాని

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి విశాఖ రాజధానితోనే సాధ్యమని, వైసిపి అధికారంలోకి వస్తే విశాఖ రాజధాని కచ్చితంగా వస్తుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. చంద్రబాబు చేతిలో ఉత్తరాంధ్ర ప్రాంతం మరింత వెనకబాటుకు నెట్టబడిందని, తిరిగి ఆయనను నమ్మి మోస పోవద్దని వ్యాఖ్యానించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో వాకర్స్, క్రీడాకారులతో ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ నుంచే పాలన అందించేందుకు దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. రాజధానిపై టిడిపి స్టాండ్ ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు అచ్చెన్నాయుడు, రామ్మోహననాయుడు, కూన రవికుమార్‌లు ప్రజలకు ఏం చెపుతారని ప్రశ్నించారు. 1983 నుంచి టిడిపికి కంచుకోటగా ఉన్న జిల్లాకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏఒక్కటి కేటాయించపోయినా జిల్లాలోని టిడిపి నాయకులు ఎందుకు నోరెత్తలేదన్నారు. స్టేడియం నిర్మాణాలను కూలదోసింది టిడిపి కాదా? అని ప్రశ్నించారు. స్టేడియం నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరు చేయించింది వైసిపి ప్రభుత్వమని, తిరిగి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే నిర్మాణం పూర్తి చేస్తామని హామీనిచ్చారు. సమావేశంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, వైసిపి నాయకులు మెంటాడ స్వరూప్, సాధు వైకుంఠం, బిర్లంగి రామ్మోహనరావు, శిమ్మ రాజశేఖర్ సుంకరి కృష్ణ, దుంగ సుధాకర్, అంధవరపు రమేష్, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బి.వి.రవిశంకర్, శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్, జెసి

సాధారణ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జెసి ఎం.నవీన్ పిలుపునిచ్చారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు శనివారం అవగాహన కల్పించారు. స్వీప్‌లో భాగంగా సంతకాల సేకరణ, ఫొటో కియోస్క్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరి చేతిలో ఆయుధం ఓటు అని, 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఎన్నికల్లో పోలింగ్ రోజు ఓటు వేయాలని అన్నారు. 2019 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని ఆకాంక్షించారు. మారుమూల గ్రామాల్లో, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, శ్రీకాకుళం ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, మెప్మా పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు సభాస్థలి పరిశీలన

ప్రజాశక్తి- పలాస



వివరాలు సేకరిస్తున్న ఎస్‌పి రాధిక

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 15న పలాసలో రోడ్ షో సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వా జూనియర్ కళాశాల మైదానంలోని హెలీప్యాడ్, సభాస్థలిని ఎస్‌పి జి.ఆర్.రాధిక శనివారం పరిశీలించారు. ఇందిరాచౌక్, రోడ్ చేసే ప్రాంతాలనూ పరిశీలించారు. ఇందిరాచౌక్ వద్ద సభ నిర్వహణ జరగడానికి ఏర్పాట్లు చేయడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ వైర్ల సమస్య ఉన్నట్టు గుర్తించారు. వాటిని సరిచేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ స్థలాలు, విఐపి పార్కింగ్ ప్రాంతాలు గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని డిఎస్‌పి నాగేశ్వరరెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. చుట్టూ బారికేట్లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలన్నారు. ఆమె వెంట సిఐ విజయానంద్, ఎస్ఐ పారినాయుడు ఉన్నారు.

గౌతు శిరీష

చంద్రబాబునాయుడు పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష కోరారు. ఈ మేరకు ఆమె చంద్రబాబు పర్యటించే ప్రాంతాలు, హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఆమె వెంట వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్త, మల్లా శ్రీనివాస్, జోగ మల్లి పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నూతన కలెక్టర్ భవనంలో నిర్వహిస్తున్న ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శనివారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో నిర్వహిస్తున్న ఎంసిఎంసి, సోషల్ మీడియా, డిస్ట్రిక్ట్ కాంటాక్ట్ సెంటర్ 1950, కంప్లైంట్ మోనిటరింగ్ సెల్, పోలీసు కంట్రోల్ రూమ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సీ-విజిల్ విభాగాల్లో ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. వస్తున్న ఫిర్యాదులు, వాటికి పరిష్కారాలు, తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత విభాగాల అధికారులతో చర్చించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, జిపియస్ వాహనాలు, అవి వెళ్తున్న రూట్లను పరిశీలించారు.

ఎన్నికల పర్యవేక్షణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఎన్నికలు స్వేచ్ఛయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు అవగాహన, శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని పరిశీలించే సమయంలో ఎలాంటి తప్పిదాలు, ఉల్లంఘనలు జరుగుతున్నట్టు గుర్తించినా తక్షణమే రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ సమయానికి గంట ముందు మాక్ పోలింగ్ తప్పక నిర్వహించాలన్నారు. పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలన్నారు. అభ్యర్థికి ఒక పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు వరుస క్రమంలో వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మూకుమ్మడిగా పోలింగ్ కేంద్రానికి వస్తున్నట్టు గమనిస్తే తక్షణమే సమీపంలోని పోలీసులను అప్రమత్తం చేయాలన్నారు. పోలింగ్ విధానాన్ని పరిశీలించిన మైక్రో అబ్జర్వర్లు వారికి ఇచ్చిన ఫార్మట్‌లోనే నివేదిక ఇవ్వాలని వివరించారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ విధానాన్ని, ఇవిఎం, వివి ప్యాడ్లను వినియోగించే విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మైక్రో అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకోవాలి

వృద్ధులకు, వికలాంగులకు భారత ఎన్నికల సంఘం కల్పించిన హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం అధిక అంగవైకల్యం (40 శాతం పైబడి) ఉన్న వారికి, 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునేందుకు హోం ఓటింగ్ సౌకర్యాన్ని అందుబాటులో తెచ్చిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. మే 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హోమ్ ఓటింగ్‌కు ఆసక్తి ఉన్న వారి నుంచి ఈ నెల 18 నుంచి 23 వరకు ఫారం-12డి దరఖాస్తులను సంబంధిత సిబ్బంది సేకరిస్తారని, వాటి ఆధారంగా హోమ్ ఓటింగ్ అవకాశం కల్పిస్తామని తెలిపారు.

ఫారం-12డిపై అవగాహన

ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 12డి విధానంపై నోడల్ అధికారులు ఐసిడిఎస్, మెప్మ పీడీలు అవగాహన కల్పించారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, వికలాంగులు, కోవిడ్ బాధితులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం ఉందన్నారు. మే 5 నుంచి 8 వరకు నాలుగు రోజుల పాటు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఓటింగ్ వేసే విధంగా దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లాలన్నారు. ఓటు వేసే సమయంలో అన్నివిధాలా సహకరించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియను గోప్యంగా ఉంచాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో నోడల్ అధికారులు, సమన్వయకర్తలు బాలాజీ నాయక్, ఎం.కిరణ్‌కుమార్, శేషగిరిరావు, బి.శాంతిశ్రీ, ఎం.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా తాగునీరు తరలింపు

లెక్కచేయని పంచాయతీ తీర్మానం



నీటిని తరలిస్తున్న ట్యాంకర్లు

నౌపడ: సంతబొమ్మాళి మండలం యామలపేటలో వ్యవసాయ బోర్ల ద్వారా నీటిని తోడి బయటకు అమ్ముకూడదని గ్రామస్తులు, పంచాయతీ పెద్దలు శుక్రవారం తీర్మానం చేశారు. అయినా మాజీ ప్రజాప్రతినిధి లెక్కచేయకుండా స్వయంగా తానే తను వ్యవసాయ భూలోని నీటిని ట్యాంకర్ల ద్వారా బయటకు అమ్ముకుంటున్నారు. దీనిపై గ్రామస్తుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల భూగర్భ జలాలు ఇంకిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మహిళలు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా నీటిని అమ్మకోకుండా కట్టడి చేయాలని గ్రామ తీర్మానం కూడా చేశారు. అయితే ఇవేమీ లెక్కచేయకుండా అధికార పార్టీ అండతో ఓ నాయకులు నీళ్లు అమ్ముకుంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై గ్రామస్తుల ప్రశ్నిస్తే తన భూమిలో వేసిన బోరు తమ ఇష్టమని, గ్రామస్తులు తనకు ఎందుకని సమాధానం ఇచ్చినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. తీర్మానంలో ఉన్న విధంగా గ్రామంలోని 200 మందికి ఉపాధి ఇస్తున్న ఎన్ఎస్ కంపెనీకి నీటి సరఫరా ఆపితే తానూ బయటకు అమ్ముకోనని కొర్రీలు పెడుతున్నట్లు చెబుతున్నారు. అంతేకాకుండా వంశధార కాలువ తమ భూమి కొండానే వెళ్తుందని, తనను ఇబ్బంది పెడితే కాలువను మూసివేస్తానని బెదిరించినట్లు గ్రామస్తులు చెప్తున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి, పలువురు నాయకులు మాజీ ప్రజా ప్రతినిధిని ప్రశ్నించారు. తనకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఉన్నాయని, అందుకే అమ్ముకుంటున్నానని చెప్పడం కొసమెరుపు.

అగ్రిగోల్డ్ సమస్యను మేనిఫెస్టోలో చేర్చాలి

అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగేశ్వరావు



కోటబొమ్మాళి : వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అగ్రిగోల్డ్ యాజమాన్యం పక్షమా? అగ్రిగోల్డ్ బాధితుల పక్షమా? రాజకీయ పార్టీలు తేల్చుకోని మేనిఫెస్టోను విడుదల చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరావు డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులు మృతి చెందితే రూ.3 లక్షల ఇస్తామని చంద్రబాబు చెపితే, కాదు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని గత ఎన్నికలకు ముందు సిఎం జగన్ నమ్మబలికారని గుర్తు చేశారు. రూ.వేల కోట్ల ఆస్తులుండి బినామీ వ్యాపారాలు చేసుకుంటున్న అగ్రిగోల్డ్ యాజమాన్యానికి అండగా నిలుస్తూ బాధితులకు ఇచ్చిన హామీని మరచి ఐదేళ్ల పాలన సాగించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రూ.20వేల లోపు ఉన్న డిపాజిట్లకు రూ.1183 చెల్లిస్తామని, ఆరు నెలల్లో బాధితులందరికీ వడ్డీతో సహా చెల్లిస్తామని చెప్పి ఐదేళ్లు గడచినా ఇంతవరకు చెల్లించలేదని అన్నారు. ఈ సమావేశంలో బాధితుల తరుపున జయసింహ, సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్, సనపల నర్సింహులు పాల్గొన్నారు. అనంతరం బాధితుల సమావేశాన్ని నిర్వహించారు.

కోటబొమ్మాళి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను టిడిపి మేనిఫోస్టోలో పెంచాలని కోరుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుకు నాగేశ్వరరావు కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సనపల నర్సింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జైసింహ, గోవిందరావు, అరేలమ్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర సుందర్‌లాల్, మొజ్జాడ యుగంధర్ పాల్గొన్నారు.

ఉచితాల చుట్టే ప్రచారమంతా

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో నాలుగు రోజులే ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేశాయి. వైసిపి, టిడిపి అభ్యర్థులు ఓటర్లను కలుసుకుని ఓట్లను అభ్యర్థిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ టిడిపి, నవరత్నాలు అంటూ వైసిపి అభ్యర్థులు ఊదరగొడుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఏం చేయబోతున్నామో టిడిపి చెప్పడం లేదు. ఇప్పటివరకు తామేమి చేశామో వైసిపి చెప్పుకునే పరిస్థితి కనిపించడం లేదు. రెండు పార్టీలు కేవలం ఉచితాలు, సంక్షేమ పథకాలపైనే ఆధారపడి ఎన్నికల్లో నెగ్గాలని చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఏ మేరకు అందాయో? ఎవరికీ తెలియంది కాదు. అమ్మఒడి, నేతన్ననేస్తం, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలకు రకరకాల కోతలు విధించి లబ్ధిదారులను కుదించారు. తాజాగా చేయూత, విద్యా దీవెన, స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ డబ్బులు ఇస్తామని బటన్ నొక్కినా నేటి వరకు ఖాతాలో జమ కాలేదు. నవరత్నాల్లో మరో ముఖ్యమైన అంశం జగనన్న కాలనీలు. జిల్లాకు 74 వేలకు పైగా ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు 30 వేల ఇళ్లే పూర్తయ్యాయి. వాటిలో సగం ఇళ్లకు తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సౌకర్యాలనూ కల్పించలేకపోయారు. అభివృద్ధికి సంబంధించి జిల్లాకు ఒకట్రెండు ప్రాజెక్టులకు మినహా ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టలేకపోయారు. వంశధార ఫేజ్-2, స్టేజ్-2 ప్రాజెక్టు, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులను ఐదేళ్ల కాలంలో పూర్తి చేయలేకపోయారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మించి మత్స్యకారులకు ఇక్కడే ఉపాధి కల్పిస్తామన్న హామీలు మాటలకే పరిమితమయ్యాయి. జిల్లాల పునర్వవస్థీకరణ తర్వాత ఐటిడిఎ లేని జిల్లాగా ఉన్న శ్రీకాకుళంలో ఐటిడిఎ నిర్మించాలని గిరిజనులు రెండేళ్లుగా పోరాడుతున్నా ఒక్క వైసిపి ఎమ్మెల్యే స్పందించిన దాఖలాలేవు. కిడ్నీ రీసెర్చ్, ఉద్దానం రక్షిత తాగునీటి పథకాలు నిర్మించామని చెప్తున్నా.. అవీ, పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో రాలేదు.

ఇక టిడిపి విషయానికి వస్తే ఉచితాల విషయంలో వైసిపితో పోటీ పడుతోంది. పార్టీ అధిష్టానం ఆదేశాలతో అభ్యర్థులంతా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపైనే ప్రధానంగా ప్రచారం సాగిస్తున్నారు. ఇందులో ప్రధానమైనది యువతకు ఉపాధి కల్పన అంశం. ఏడాదికి 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశాన్ని ఎక్కడా ప్రస్తావించడం లేదు. రాష్ట్రంలో 2.40 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయకుండా వాలంటీర్ ఉద్యోగాలు ఇచ్చిందంటూ వైసిపి ప్రభుత్వంపై టిడిపి దుమ్మెత్తిపోస్తోంది. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎక్కడా చెప్పడం లేదు. ఉపాధి కల్పించకుంటే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు చెల్లిస్తామని టిడిపి హామీ ఇస్తోంది. 2014 ఎన్నికల్లో టిడిపి ఇదే హామీ ఇచ్చి... దానిని అటకెక్కించిన విషయం అందరికీ తెలిసిందే. 2016లో నిరుద్యోగ భృతి అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతుందంటూ వార్తలు రావడంతో శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఉపాధి కార్యాలయాలంలో వేలాది మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత దాని ఊసెత్తలేదు. కేవలం ఉచితాలపై ప్రచారం సాగిస్తున్న టిడిపి జిల్లా అభివృద్ధిలో వైసిపి వైఫల్యాన్ని ఎండగట్టడాన్ని విస్మరించింది. సాగునీటి ప్రాజెక్టులు, కరకట్టలు వంటి పనులు పడకేసినా టిడిపి దానిపై మాట్లడటం లేదు. రైతుల సమస్యలపైనా నోరెత్తడం లేదు. జీడి పిక్కల 80 కేజీల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు దాదాపు ఏడాది కాలంగా పోరాడుతున్నా వారి డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇదిగో అదిగో కొంటామంటూ కాలయాపన చేసింది. దీనిపై కనీసం ఉద్దాన ప్రాంతానికి చెందిన టిడిపి అభ్యర్థులూ మాట్లాడని పరిస్థితి నెలకొంది. టిడిపి తన ఐదేళ్ల కాలంలో వంశధార, ఆఫ్‌షోర్ పూర్తి చేయలేని వైఫల్యాన్ని మూటకట్టుకుంది. జిల్లాకు ఐటిడిఎ కావాలని గిరిజనులు మొత్తుకుంటున్నా వేం అధికారంలోకి వస్తే ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని ఏనాడూ టిడిపి చెప్పలేకపోయింది. అభివృద్ధి, జిల్లా సమస్యలను విస్మరించి బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ అంటూ సంక్షేమ పథకాలపైనే ఆధారపడితే మాత్రం ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు గ్యారంటీ లేకుండా పోతుందనే చర్చ ప్రస్తుతం జిల్లాలో నడుస్తోంది.


పోస్టర్‌ను అందజేస్తున్న నాగభూషణరావు

కాంగ్రెస్ అభ్యర్థి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో శ్రీకాకుళం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పైడి నాగభూషణరావు ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. నగరంలోని హయాతీనగరం, ముచ్చువానిపేట, పిఎన్ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ మేనిఫోస్టోను వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందని, విభజన చట్టం పరిధిలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. అటువంటి పార్టీతో జత కట్టి టిడిపి, వైసిపి పదేళ్లుగా ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. తిరిగి కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి వస్తే విభజన హామీలు అమలవుతాయని, ప్రజలు ఆదరించి కాంగ్రెస్ పార్టీని బలపరచాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. ఆదివారం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామం దగ్గర జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ఓటువేసి ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, సాయిరాం, సునీల్, బొత్స వెంకటరమణ, దాలయ్య, అప్పారావు, సనపల వాసుదేవరావు పాల్గొన్నారు.

ఇంటింటా 'సువ్వారి' ప్రచారం

ప్రజాశక్తి- పొందూరు

అరాచక అహంకార నాయకులను నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తండ్యాంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో తనకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక నాయకుడు అవినీతి, అరాచకాలకు పాల్పడుతూ నియోజకవర్గ అభివృద్ధిని కుంటుపరిస్తే మరో నాయకుడు అహంకార ధోరణితో అధికారులు, ప్రజలపై విరుచుకుపడుతూ భయభ్రాంతులకు గురిచేస్తుంటారన్నారు. ఇటువంటి నాయకులు నియోజకవర్గానికి అవసరమా అని ప్రశ్నించారు. వీరిద్దరి పాలనలో నియోజకవర్గం అన్ని విధాలా వెనకబడి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేకా వెంకటరావు, రాజు, ఈశ్వరరావు, కూర్మారావు, కోరుకొండ సాయికుమార్, పోతురాజు సూర్యారావు, పిన్నింటి అప్పలనాయుడు, చింతాడ శివకుమార్ పాల్గొన్నారు.

'గ్లోబల్'లో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విలువలతో కూడిన విద్యను అందించటమే ధ్యేయమని గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సద్గుణ తెలిపారు. నగరంలోని 80 అడుగుల కూడలి వద్ద శనివారం విద్యార్థులకు అభినందించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఆశయంతో గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ స్థాపించామని అన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆర్గనైజేషన్ ప్రోత్సాహంతో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభ కనబరచిన వారిని సత్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో మొదటి సంవత్సరం ఎంపిసిలో బి.తనూజా 464, కె.వైష్ణవి 451, ఎ.మేఘన 461, ఎన్.భార్గవి 462, బైపిసి మొదటి సంవత్సరంలో పి.చాందిని 427, కీర్త ప్రియ 427, రెండో సంవత్సర విద్యార్థినులు సిహెచ్.దివ్యతేజశ్రీ 979, గాయత్రీదేవ్ 971 మార్కులు సాధించారన్నారు. అనంవీరికి బంగారు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉమా మణిశర్మ, గోపి, స్వరూప్, సత్యవాణి, గోపి, ఉర్లం శివతేజ పాల్గొన్నారు.


స్నాతకోత్సవంలో మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ వైద్యులు నెఫ్రాలజిస్ట్ ఎ.అంజని అన్నారు. శనివారం పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో చిన్నారుల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న నర్సరీ, ఎల్‌కెజి, యూకెజి చిన్నారులు వివిధ రకాల వేషధారణాలతో అలరించారు. కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ అంజని మాట్లాడుతూ కిడ్స్ కాన్వకేషన్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వలన పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని, తద్వారా పిల్లలు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అందుకోగలుగుతారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.టినేష్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పిల్లలు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడటం ఉపాధ్యాయుల కష్టానికి ప్రతిఫలమని కొనియాడారు. ఈ సందర్భంగా పిల్లలు వివిధ రకాల నృత్యాలు, రైమ్స్, స్టోరీలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో రవీంద్ర భారతి పాఠశాల ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్, సిజిఎం జి.ఆర్.వసంత, డివిజనల్ ఇన్‌ఛార్జి సిహెచ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కాకినాడ ఆదిత్య' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ పరీక్షల్లో నగరంలోని కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎంపిసిలో బి.తూజ 464, ఎన్.భార్గవి 462, మరో 15 మందికి 460 మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి తెలిపారు. జూనియర్ బైపిసిలో సిహెచ్.కీర్తి 427, పి.చాందిని 427 మార్కులు సాధించారని అన్నారు. సీనియర్ ఎంపిసిలో బి.స్వర్ణశ్రీ 983, పి.ప్రవీణ్ 980, 25 మంది విద్యార్థులు 970 పైబడి మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపిసిలో ఎ.దీవెన 979, పి.వరం 972 మార్కులు సాదించి సత్తాచాటారని వివరించారు. విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ ఢిల్లీశ్వరరావు అభినందించారు.

'ఐతమ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మొదటి ఏడాది ఎంబిఎ విద్యార్థులు ఒడిశాలోని చెంచూరియన్ యూనివర్శిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన నేషనల్ స్టూడెంట్ మేనేజ్‌మెంట్ ఫెస్టో భాగంగా 'ట్రెజర్ హంట్' కాంపిటేషన్లో పాల్గొన్నారు. ఈ మేరకు మొదటి బహుమతి సాధించినట్టు ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు వై. అపూర్వ, బి.దాక్షాయని, వి.లీలాకుమారి, ఎస్.శ్రావ్య, సాయికుమార్ జెన్నా, జె.వంశీకృష్ణ, కె.హర్షవర్ధన్‌లు ప్రశంసాపత్రాలు పొందారు. వీరికి డైరెక్టర్తఓ పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌డి డాక్టర్ బి.శివకుమార్ అభినందించారు.

'సూపర్ సిక్స్'పై ప్రచారం


సోంపేట : ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పొందూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం వేగవంతం చేస్తున్నాయి. మండల కేంద్రంలో శనివారం టిడిపి ఆముదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శంఖారావం ఎన్నికల ప్రచారంలో భాగంగా రవికుమార్ ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ రామ్మోహన్, నాయకులు కె.సత్య నారాయణ, ఎ.రాము, వి.మురళి, ఎ.చినరంగ, బలగ శంకర భాస్కర్, బాడన శేషగిరి, ఎంపిటిసిలు బి.హారిక, ఎ.వాణి, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, కె.శ్రీనివాసరావు, కిషోర్, శ్రీనివాసరావు, దండా రవి, జనసేన మండల అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: పాలనలో మార్పు కోసం టిడిపి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అభ్యర్థించారు. నగరంలోని 27వ డివిజన్‌లో శనివారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచార కార్యక్రమం మైలపల్లి నరసింహామూర్తి, బరాటం ఈశ్వరరావు ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, కోరాడ హర గోపాల్, బుర్రి మధు, రెడ్డి గిరిజాశంకర్, శ్యాంసుందర్, పొన్నాడ రవి, కిషోర్ బాలాజీ, అందవరపు శ్రీను, అంబటి లక్ష్మీరాజ్యం, పిరియా మాధవి, జనసేన నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గత ఐదేళ్లుగా వైసిపితో ప్రజలు తీవ్ర కష్టాలు పడ్డారని తెలుగు మహిళా అధ్యక్షురాలు జి.స్వాతి అన్నారు. గార మండలం కళింగపట్నం పంచాయతీలో స్వాతి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పొందూరు : పోస్టర్‌ను పంపిణీ చేస్తున్న రవికుమార్, నాయకులు

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్ గెలుపునకు ఆయన సతీమణి నిలోత్పల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సోంపేట : మండల కేంద్రం సోంపేటతో పాటు జాతీయ రహదారికి అనుకొని ఉన్న కొర్లం నుంచి జెపి కొత్తూరు వరకు టిడిపి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ మేరకు ఎంపీ రామ్మోహన్ నాయుడుకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్థానిక ఎమ్మెల్యే అశోక్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాకన్నపురం, జగతికేసుపురం, పొత్రకండ, మామిడిపల్లి, రాజాం, సోంపేటలో ర్యాలీ నిర్వహించారు.

పోలాకి: నరసన్నపేట పట్టణంలో ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి పట్టణంలో నేతాజీ వీధి, కోవెల వీధి, ఊర్ణ వీధి, విలేకర్ కోలని, పాత బస్టాండ్ పరిధిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

విజ్ఞానం అవసరం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం అవసరమని డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. శనివారం వివిధ కళాశాలల విద్యార్థులతో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయంలో ఘనంగా టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టెక్ని వెర్స్ టెక్నికల్ ఫెస్ట్‌లో ఇవి వెహికల్స్, డ్రోన్ సర్వేయింగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఫోన్‌ఫార్జ్, టెక్ అరేనా, టెక్‌ఫేట్, వెబ్ డిజైన్ తోన్, కన్సలే హాక్, కాగానితో కోడ్, అన్వేషక, మైండ్ టెంటాకల్స్, ఎలక్ట్రిక్కింగ్, సర్క్యూరిటీరి, స్పార్క్ యువర్ బ్రెయిన్, డిజైన్ డేర్నైతో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం, వినోదం అందించే ఉదేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ప్రశాంత్ కుమార్ నంద, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరి నాయుడు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత


పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎచ్చెర్ల: మండలం షేర్ మహమ్మద్ పురంలో సర్వే నెంబర్ 636/ 2లో 40 ఎకరాల కొండ పోరంబోకు భూమిని 1985లో గురుకుల పాఠశాలకు కేటాయించారు. దీనికి అదనంగా సర్వే నెంబరు 230-1, 234-12, 235, 237లో 14-70 జిరాయితీ భూమి సొసైటీ కొనుగోలు చేసింది. ఆరు ఎకరాల్లో పాఠశాలను నిర్వహిస్తుండగా మిగిలిన స్థలంలో కొంత ఆట స్థలానికి వినియోగిస్తున్నారు. మిగిలి ఉన్న భూభాగాన్ని రక్షణ కంచె లేకుండా వదిలేశారు. ఈ క్రమంలో కొందరు ఆ స్థలాన్ని ఆక్రమిస్తూ పాఠశాలకు స్థలం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆ భూభాగంలో భవనాన్ని నిర్మించే ప్రయత్నం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ తహశీల్దార్‌కు, పోలీసులకు తెలియజేసి వెంటనే ఆ నిర్మాణాన్ని నిలుపుదల చేయించాలని కోరారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు స్థలాన్ని పరిశీలించి నోటీసులిచ్చి నిర్మాణాన్ని నిలుపుదల చేయించారు. మళ్లీ శనివారం నిర్మాణం కొనసాగించడంతో పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్ అధికారులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ పరిశీలకురాలు మధుప్రియ నిర్మాణం వద్దకు చేరుకొని తక్షణమే నిర్మాణాన్ని ఆపాలని అడ్డుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఒక మహిళా నాయకురాలు తన అండదండలతో నిర్మాణాన్ని కొనసాగించే ప్రయత్నం చేశారు. అయితే వెంటనే ఈ నిర్మాణాన్ని తొలగించి పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరారు.

చంద్రబాబు బూటకపు హామీలు నమ్మొద్దు


ఇచ్ఛాపురం : 'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న విజయ

ప్రజాశక్తి- పలాస

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెబుతున్న బూటకపు హామీలను నమ్మొద్దని పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్ల, లక్ష్మీపురం, బంటుకొత్తూరు, గరుడఖండి పంచాయతీల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ వాలంటీర్ల వ్యవస్థ పెడితే ఎందుకని ప్రశ్నించిన చంద్రబాబు... టిడిపి అధికారంలోకి వచ్చాక వాలంటీర్లకు రూ. 10 వేలు ఇస్తామని చెప్పడానికి సిగ్గులేదా? అని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గంలో అసమర్థులకు అధికారం కట్టబెడితే అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పలాసలో 200 పడకల ఆస్పత్రి కిడ్నీ పరిశోధన కేంద్రం, రూ.700 కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సర్పంచ్‌లు బొత్స రాజేశ్వరి, బి.పుష్పలత పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రానున్న ఎన్నికల్లో వైసిపికి ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ కోరారు. మండలంలోని కేసుపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. పేదలకు బాసట నిలిచిన ఏకైక వ్యక్తి సిఎం జగన్ అని అన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ రాజారెడ్డి, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆసి పురుషోత్తం, ఆసి కృష్ణారెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, నీలాపు చంద్రయ్య, దేవరాజ్ పాల్గొన్నారు.

కవిటి: ఇచ్ఛాపురం వైసిపి అభ్యర్థి పిరియా విజయ ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌తో కలిసి శనివారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెలవంక పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌతమీ రెడ్డి, వైసిపి నాయకులు దుక్క లోకేశ్వరరెడ్డి, దువ్వు కృష్ణారెడ్డి, దేవరాజు సాహు, యలమంచి నీలయ్య, కుమార్ మోహన్‌రెడ్డి, కృష్ణ బిసాయి, బద్రి ప్రకాష్, ఇందు శేఖర్ వర్మ, ఎస్.పి.ప్రవీణ్ పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని కొండములగాం, రావాడ, జె.ఆర్.పురం పంచాయతీల్లో శనివారం స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. కొండములగాంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకొని, వారికి అందుతున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నైరా, సింగుపురం గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మాన రామ్ మనోహర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మాన ప్రసాదరావుకు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పలాస : ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు


రణస్థలం : 'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

పోలింగ్ కేంద్రాలు పరిశీలన


నందిగాం : రికార్డులను పరిశీలిస్తున్న నూరల్ కమర్

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కృష్ణరాయపురం, కణితి ఊరు, మణిగాం, వేణుగోపాలపురం, వల్లభ రాయుడుపేట, దొడ్డ రామచంద్రపురం, దేవాడ నరేంద్రపురం, పాలవలస, నందిగాం, సుభద్రాపురం, బెజ్జిపల్లి పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరల్ కమర్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, తాగునీటి, భవన సముదాయాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఒ శివప్రసాద్, సీనియర్ సహాయకులు నర్సింగరావు ఉన్నారు.

టెక్కలి : మండలంలోని గూడెం పంచాయతీ పిట్టలసరియా పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ నురల్ కమర్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని మౌలిక సదుపాయాల్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సిబ్బంది ఉండేందుకు వీలుగా కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే గ్రామాల్లోని మనరులను సద్వినియోగం చేసుకోవాలని బిఎల్‌ఒలకు సూచించారు.

లావేరు: మండలంలో మురపాక, పెదరావుపల్లి, కేశవరాయునిపాలెం గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆర్‌ఒ ఎస్.వి.లక్ష్మణమూర్తి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసులను ఆదేశించారు. రాజకీయ పార్టీలు ఎన్నికలు నియమావళిని అతిక్రమించకుండా తరుచూ పరిశీలించాలన్నారు. ఈయన వెంట జె.ఆర్.పురం సిఐ జి.రామచంద్రరావు, తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎస్ఐ స్వామినాయుడు, సిబ్బంది ఉన్నారు.


అవార్డు అందుకుంటున్న కుమార్ నాయక్

కుమార్ నాయక్‌కు నంది అవార్డు

ప్రజాశక్తి- పలాస

గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో శుక్రవారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో 'దుర్దశ' ఒడియా నాటికను కాశీబుగ్గకు చెందిన డాక్టర్ కుమార్ నాయక్ బృందం ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనకు గాను కుమార్ నాయక్‌కు ఉత్తమ నటుడుగా నంది అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ (న్యూఢిల్లీ) సభ్యులు డాక్టర్. ఎస్.పి.భారతి, ఎపి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మిరెడ్డి, ఎపి దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, ఇండియా ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ కమిషనర్ కె.వి.రెడ్డి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, ఎపి వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండేల శ్రీరామ్మూర్తి, సినీ దర్శకులు మాగంటి ప్రసాద్‌బాబు, ఫిలిన్రో పిక్ ఆఫ్ ఇండియా సంస్థ అధ్యక్షులు అద్దంకి రాజాయోన్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల్లో ఓటే మన ఆయుధం..చేజార్చుకోకు వచ్చిన అవకాశం అన్న నినాదాలతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మండలంలోని వంజంగి, వంజంగిపేటలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వయోజనులందరూ తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, పల్లె పల్లెలో మహిళలకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ ఇ.వి.రమణ, అధ్యక్షులు పైడి సుజాత, దయిళ లక్ష్మీనారాయణ, విఒఎలు శ్రీదేవి, చంద్రకళ, గ్రామ సంఘం లీడర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఓటు విలువ ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని తహశీల్దార్ సురేష్ అన్నారు. వజ్రపుకొత్తూరు బస్టాండ్ వద్ద ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా బూత్ లెవెల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిటి గిరిరాజ్, ఆర్ఐ పవిత్ర, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు ఆంక్షలు


సీజ్ చేసిన సైలెన్సర్లను చూపిస్తున్న సిఐ ఇమాన్యుల్‌రాజు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సర్కల్ పరిధిలోని మున్సిపాలిటీ ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించామని సిఐ టి.ఇమాన్యుల్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించామన్నారు. ఉదయం 8 గంటలు లోపు, రాత్రి 8 తర్వాత పట్టణంలో భారీ వాహనాల రాకపోకలు ఎగుమతి, దిగుమతులు చేసుకోవాలన్నారు. ఈ ఆంక్షలు ఉల్లంఘించి వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుపై ఎక్కడికక్కడ పెట్టిన 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నంబరు ప్లేట్ లేకుండా వాహనాలు నడిపినా పార్కింగ్ వద్ద వాహనాలకు హ్యాండిల్ లాక్ వేయకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు పాటించాలన్నారు. డిజెలకు కాశీబుగ్గ డిఎస్‌పి నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పురుషోత్తంపురం పాత చెక్‌పోస్టు వద్ద ఉన్న బడ్డికొట్టు వర్తకులకు కౌన్సెలింగ్ ఇచ్చామని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్ధాలు విక్రయిస్తే షాపులన్నీత తొలగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు

ఆమదాలవలస: ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా శనివారం ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో రెండోవార్డు పరిధిలోని కృష్ణాపురం జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రాకపోకలు సాగించాలన్నారు. రూ.50వేలు దాటి నగదును తీసుకువెళ్తే సంబంధిత ధ్రువ పత్రాలు తప్పకుండా ఉండాలన్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను తరలిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భానుడు ఉగ్రరూపం

ప్రజాశక్తి- బూర్జ

భానుడు తన ఉగ్రరూపాన్ని చూపుతున్నాడు. గతవారం రోజులుగా అధిక ఎండతో తన ప్రతాపాన్ని చూపించిన సూర్యుడు శనివారం ఉదయం 9 గంటల నుంచే తన విశ్వరూపాన్ని చూపించాడు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిపై అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించేవి. అయితే 11 గంటల నుంచి ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. ప్రజలు బయటికి రావడానికి భయపడుతున్నారు. ఇలాగే కొనసాగితే పరిస్థితులు మరింత దారుణంగా ఉంటాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


నిర్మానుష్యంగా ఉన్న శ్రీకాకుళం- పాలకొండ ప్రధాన రహదారి

వ్యక్తి మృతి

కొత్తూరు : మండలంలోని గూనభద్ర ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలోని మామిడిచెట్టు పైనుంచి జారిపడి అదే కాలనీకి చెందిన మీసాల మిన్నారావు (35) శనివారం మృతి చెందారు. మామిడి పళ్లు తీసేందుకు వేకువజామున చెట్టు ఎక్కాడు. పళ్లు తీస్తుండగా చేయి పట్టు పట్టడంతో చెట్టు కింద ఉన్న రేకుల షెడ్‌పై పడి అక్కడి నుంచి కిందకు జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెచ్‌సి కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రమ్య, కుమారులు మోక్షిత్, యస్వాంత్ ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తు న్నారు. దీంతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.


బోల్తా పడిన కారు

కారు బోల్తా

నందిగాం : మండలంలోని పెద్దబాణాపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడింది. ఈ కారు టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. ప్రమాదాన్ని గమనించి ముగ్గురూ కార్డు నుంచి బయటకు దూకేశారు. వీరు స్వల్ప గాయాలతో బయట పడడంతో అటుగా వెళ్లిన ఆర్‌టిసి బస్సు ఎక్కి పలాస వైపు వెళ్లిపోయారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

గంజాయి పట్టివేత

కొత్తూరు : గుణుపూర్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్‌టిసి బస్సులో అంతర్రాష్ట్ర పోలీసులు కడుం చెక్‌పోస్టు వద్ద శనివారం తనిఖీలు నిర్వహించారు. తనికీల్లో భాగంగా బుగులోని గంజాయిని గుర్తించారు. వెంటనే బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 50 కేజీలు గంజాయి ఉంటుందని అంచనా వేశారు.


బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి : మండలంలోని ఎంపిసి కొత్తూరులో టెక్కలి ఎక్సైజ్ అధికారులు నాటుసారా తయారీ స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 15 లీటర్లు ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ జి.రాజశేఖర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


రాజీనామా పత్రాలు చూపిస్తున్న వాలంటీర్లు

22 మంది వాలంటీర్లు రాజీనామా

లావేరు: మండలంలో గ్రామ వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. తాజాగా శనివారం అదపాక సచివాలయానికి చెందిన 22 మంది గ్రామ వాలంటీర్లు స్వచ్ఛందగా రాజీనామా చేసి రాజీనామా పత్రాలను కార్యదర్శికి అందజేశారు. వాలంటీర్లు రాజీనామా చేయాలని ఆయా సచివాలయాలకు చెందిన వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడి చేయడంతోనే రాజీనామాలు చేయాల్సి వస్తుందని కొంతమంది వాలంటీర్లు ఆవేదన చెందుతున్నారు.

సంతకాల క్యాంపింగ్

ఇచ్ఛాపురం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ అదేశాలు మేరకు స్వీప్‌లో భాగంగా ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర ఆధ్వర్యాన బస్టాండ్ వద్ద శనివారం సంతకాల క్యాంపింగ్ నిర్వహించారు. అంతకుముందు నాలుగు మండలాలు ఎంపిడిఒలతో, మున్సిపాలిటీ కమిషనర్‌తో ఎన్నికల కోడ్ అమలుపై సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

శ్రీనివాస్ పరామర్శ


పూలమాలలు వేస్తున్న శ్రీనివాస్

టెక్కలి రూరల్: టెక్కలి ఎంపిటిసి దేవాది శాంతామణి భర్త గోపి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ మృతుని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు చంటి కిల్లి అజయకుమార్ ఉన్నారు.

ముగిసిన ప్రాథమిక వార్షిక పరీక్షలు

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వార్షిక పరీక్షల్లో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహించిన వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 6న ప్రారం భమయ్యాయి. ఉపాధ్యాయులు వార్షిక ప్రణాళిక ముగించి అందుకు సంబంధించిన రికార్డులను పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. కాగా, ఉన్నత పాఠ శాలల విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి.

చలివేంద్రం ప్రారంభం

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీ రామతీర్థం జంక్షన్ వద్ద శ్రీ వీరాంజనేయ లగేజ్ ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి ప్రతిచోటా చలి వేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, శ్రీ వీరాంజనేయ లగేజ్ ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలం సింగుపురంలో పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అధ్యక్షతన శనివారం వైసిపి నుంచి మాజీ సర్పంచ్ జి.మోహన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున టిడిపిలోకి చేరారు. వారికి ఎంపీ రామ్మోహన్ నాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని తొలూసూరుపల్లి పంచాయితీ పరిధి జయకృష్ణాపురం, మున్సబుపేట గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు శనివారం టిడిపిలోకి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం రాత్రి పార్టీ కండువా వేశారు. మాజీ సర్పంచ్ బమ్మిడి అప్పలనాయుడు, బమ్మిడి శేషగిరి ఆధ్వర్యాన 200 కుటుంబాలు పార్టీలోకి చేరారు. వీరి రాకతో తొలుసురుపల్లి పంచాయితీ పార్టీ బలం పెరిగిందని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. పార్టీ విధానాలు వల్లే భవిష్యత్ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, మామిడి రాము, హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, బెహరా కాళీ, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, సోడిమూడి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పొందూరు: పట్టణానికి చెందిన 60 దళిత కుటుంబాలు శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో ఆముదాలవలస నియోజకవర్గ పరిశీలకులు ఎం.వి.పద్మావతి పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి



టిడిపిలో చేరిన వారితో రామ్మోహన్ నాయుడు, శంకర్

ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి ఆశయాలు, ఆలోచనలు నచ్చి తాము వైసిపిలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో స్పీకర్ సీతారాం

వైసిపిలో పలువురు చేరిక

పొందూరు: వైసిపికి చెందిన 50 కుటుంబాలు టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి రవికుమార్ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిఎంసి మాజీ చైర్‌పర్సన్ పిట్టా రాధ, కొండల పద్మ, నాగు, చిట్టి అప్పారావు, రమణ తదితరులు చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రామ్మోహన్, బాడాన గిరి, ఎ.చినరంగ, అనకాపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పలాస : మండలంలోని మాకన్నపల్లిలో ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన కాశీబుగ్గ సాయిరాజ్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక గౌరవ అధ్యక్షులు బి.ఓంకార్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి గైనకాలజిస్టు డాక్టర్ డి.లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొంటారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నామినేషన్‌కు తరలిరండి

కోటబొమ్మాళి: ఈ నెల 22న టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని తరలిరావాలని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల టిడిపి మండల అధ్యక్షులు, ఎంపిపిలు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ప్రగడపుట్టుగలో రాజరాజేశ్వరి కళాపీఠం శ్రీకాకుళం వారిచే శనివారం సాయంత్రం ప్రదర్శించిన సంగీత లయ విన్యాసం శ్రోతలను అలరించింది. వెంకటేశ్వర సుప్రభాత సేవ 53వ వార్షికోత్సవం సందర్భంగా కోదండ రామాలయం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సోలో కచేరిలో సుసరాపు లక్ష్మీగణపతి శర్మ వయొలిన్, సుసరాపు కుమార్ విఘ్నేష్ మృదంగం, గొనప లక్ష్మణమూర్తి కంజిరా విన్యాసాల్లో సంగీత ప్రియులు ఒళలాడారు.



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- నరసన్నపేట

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో నరసన్నపేటలో సంపత్ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ మేరకు కళాశాలలో ప్రతిభా కనపరిచిన విద్యార్థులకు డైరెక్టర్ బి.గణపతిరావు, ఉపాధ్యాయులు శనివారం అభినందనలు తెలిపారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ తమ కళాశాలలో పాగోటి దివ్య ప్రథమ ఎంపిసిలో 465, మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే ముచ్చేటి వనిత తత్ర సరస్వతి, డి.రూపేష్ శర్మ



అభినందిస్తున్న డైరెక్టర్ గణపతిరావు

464 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. జామి లక్ష్మి 462, నందుపల్లి శిరీష, ఎస్.నరసింహనాయిడు 461 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాస్కరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



సీతారామారావుకు ఫొటోను అందజేస్తున్న ఆలయాధికారులు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి నగరానికి చెందిన ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ గుంటూరి సీతారామారావు, ఉషాదేవి దంపతులు రూ.లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఇఒ చంద్రశేఖర్‌ను కలిసి చెక్కును అందజేశారు. వారితో పాటు పాలక మండలి సభ్యులు లుకలాపు గోవిందరావు ఉన్నారు.

7 నుంచి శ్రీముత్యాలమ్మతల్లి జాతర

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రం హెచ్‌పి గ్యాస్ గొడౌన్ వెనుక వెలసిన శ్రీముత్యాలమ్మ తల్లి జాతర మే 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆలయ పూజారి పెంటమాని అప్పారావు శనివారం తెలిపారు. మూడు రాత్రులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజులు జరిగే యాత్రకు యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు



ముత్యాలమ్మతల్లి ఆలయం

చెల్లించుకోవాలన్నారు.


శ్రీరామనవమి ఉత్సవాలకు నువ్వలరేవు సిద్ధం



నువ్వలరేవు ముఖద్వారం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శ్రీరామ నవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి నువ్వలరేవు సర్వాంగ సుందరంగా తయారైంది. ఈ నెల 14 నుంచి తొమ్మిది రోజులు పాటు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు బేహారాలు తెలిపారు. సామూహిక వివాహాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించి రాష్ట్రస్థాయిలో నువ్వలరేవు గుర్తింపు పొందింది. అదే స్థాయిలో శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఈ గ్రామంలో ఏటా జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వస్తుంటారు. ఇక్కడ సంప్రదాయాలకు, ఆచారాలకు స్థానికులు పెద్దపీట వేయడం, ఒడిశా సాంస్కృతి అందరినీ ఆకర్షిస్తుంది. ఇప్పటికే గ్రామంలోని సింహద్వారానికి, ఆలయానికి విద్యుత్ అలాంకరణలతో ముస్తాబు చేశారు.



ముస్తాబైన రామాలయం

గ్రంథాలయ కార్యదర్శికి సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుంటూరు జిల్లా పొత్తూరులో జరిగిన కవి సమ్మేళనంలో శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజును ఘనంగా సత్కరించారు. సాహితీ కిరణం ఆధ్వర్యాన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సంబరాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో కవితాగానం చేసి ఆకట్టుకున్నారు. ఆయనకు భైశా దేవదాస్, విడదల నిహారిక ఫౌండేషన్ అధ్యక్షులు విడదల సాంబ శివరావు, సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు చేతులమీదుగా సత్కారం లభించింది. ఆయనకు పెద్దూరు వెంకటదాసు, బందికల్లు జమదగ్ని, ఈ వేమన, శరత్ బాబు, వావిలపల్లి రాజారావు, ఉమా కవి, డిప్యూటీ గ్రంథ పాలకులు వి.జి.శంకరరావులు అభినందనలు తెలిపారు.

రాజకీయ క్రీడలో బలిపశువులం

ప్రజాశక్తి- కవిటి

రాజకీయ క్రీడలో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు రెవెన్యూ అధికారుల తీరుతో 20 ఏళ్లుగా తమ జాతి మోసపోతూనే ఉందని బెంతు ఒరియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ కవిటిలో బెంతొరియాలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 108వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో తరగతి పేరుతో కూడిన ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం జారీ చేయకపోవడంతో బెంతు ఒరియా విద్యార్థులు ఉపాధి, ఉన్నత చదువులు కోల్పోతున్నారని అన్నారు. ఇకనైనా స్పందించకపోతే తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

లావేరు: ఎచ్చెర్ల నియోజకవర్గ శాసనసభ్యునిగా ఒక్క అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని శనివారం గుమ్మడాం, బుడతావలస, బెజ్జిపురం, బుడుమురు, తామాడ, లక్ష్మీపురం, పెదరావుపల్లి, చిన్నరొంపివలస తదితర పంచాయతీల్లో ఆత్మీయ కలయిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలో మడ్డువలస, తోటపల్లి, బుడుమూరు నారాయణ సాగరం మినీ రిజర్వాయర్ వంటి పనులు పూర్తిచేసి రైతాంగానికి అంకితం చేస్తామన్నారు. రహదారుల అభివృద్ధి, అర్హులైన నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు స్థానికులకే కల్పించే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పి.మధుబాబు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జడా శ్రీనువాసరావు, డిజియం ఆనందరావు పాల్గొన్నారు.

జగపతి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యాదవులపై మాజీ ఎంపీపీ గొండు జగపతి కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, తక్షణమే ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు గద్దబోయిన కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. నగరంలోని పెద్దపాడు రోడ్డులోని ఓ ప్రయివేటు భవనంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. యాదవ వృత్తిని, జీవన విధానాన్ని అపహాస్యం చేస్తూ కించపరిచేలా మాట్లాడడం సామాజిక తరగతికి తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. టిడిపి అభ్యర్థి తండ్రి జగపతి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సమావేశంలో యాదవ సంఘ నాయకులు బాగు దశరథ, బోర పాపారావు, గురు రవి, నక్క దేవానంద్, సెనగల శ్యాంసుందర్, పాలిన జగదీష్ పాల్గొన్నారు.